క్లుప్తంగా

పాఠ్య పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

నింద్ర: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు ఎంఇవో శ్రీధర్‌రాజు బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మార్సీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు అందిస్తారని తెలిపారు.

ప్రమాణ స్వీకారోత్సవం ప్రత్యక్ష ప్రసారం


జీడీ నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్క్రీన్

గంగాధర నెల్లూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి వర్గ ప్రమాణ స్వీకారాన్ని స్థానికులు వీక్షించేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాట్లు చేశారు. అధికారులు, ప్రజలు పాల్గొని వీక్షించారు.

కణ్ణన్‌కు డీఈఓ అభినందన


డీఈఓ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న స్వామి కణ్ణన్

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ బడిలో పనిచేస్తూ ఇటీవల డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడు స్వామి కణ్ణన్‌ను డీఈఓ దేవరాజు అభినందించారు. బుధవారం డీఈఓ తన కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ బడిలో పనిచేస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు స్వామి కణ్ణన్ డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాల అంశాలను బోధించడమే కాకుండా తమ విజ్ఞానంతో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఆయన డీఈఓ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కార్యక్రమంలో పలువురు టీచర్లు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో మహా కుంభాభిషేకం


విశేషాలంకరణలో విఘ్నేశ్వరస్వామి

పిచ్చాటూరు: మండలంలోని రజానగరంలో నూతనంగా నిర్మించిన శ్రీవిఘ్నేశ్వరాలయ మహా కుంభాభిషేకం బుధవారం భక్తిప్రపత్తుల తో జరిగింది. వేకువజామున 3.30 గంటలకు సంకల్పబింబ శుద్ధి, రక్షాబంధనం, హోమ పూజలు, మహాపూర్ణాహుతి, గోపూజ, గజపూజ, అష్టపూజ నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు కలశ ఊరేగింపు అనంతరం విమాన గోపుర కలశ కుంభాభిషేకం, మూలవిగ్రహం కుంభాభిషేకం, దీపారాధన, మహాప్రసాద వినియోగం, 9 గంటలకు గర్భాలయంలో స్వామివారికి మహా అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.

బడికి పోదాం చలోచలో..

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- సమ్మర్ క్యాంప్‌లకు విశేష స్పందన
- పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

వేసవి సెలవులను సంతోషంగా గడిపిన విద్యార్థులు నేటి నుంచి భుజానికి బ్యాగులు తగిలించుకుని బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. విద్యార్థులు వేసవి సెలవులను వృధా చేయకుండా ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా సమ్మర్ క్యాంపులు నిర్వహించింది. రెండేళ్లుగా నిర్వహించిన ఈ సమ్మర్ క్యాంపులకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించడంతో విజయవంతం అయ్యాయి. మరో వైపు ఈ ఏడాదికి సంబంధించి స్టూడెంట్ కిట్స్ ఇప్పటికే పాఠశాలలకు చేరి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.



పుత్తూరు: ఏటా జూన్ 12న పునఃప్రారంభం కావల్సిన పాఠశాలలు, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఒకరోజు ఆలస్యంగా 13వ తేదీన ప్రారంభం అవుతున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు భయపెట్టినా సకాలంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో యథావిధిగా రెండు పూటలా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. నాలుగేళ్లపాటు అందించిన జగనన్న విద్యాకానుక కిట్లను ఈ ఈ విద్యా సంవత్సరంలో స్టూడెంట్ కిట్స్‌గా పంపిణీ చేయనున్నారు. పుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు కిట్లు సైతం ఇప్పటికే పాఠశాలలకు చేరి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. తొలిరోజే యూనిఫామ్స్, బెల్ట్స్, షూస్ పంపిణీకి అధికారులు సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు అందాకే పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ స్కూళ్ల వైపు అడుగులు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ లైట్లు, ఫ్యాన్లు, డెస్కులు, డిజిటల్ బోర్డులు, మరుగుదొడ్లు, ఆర్‌ఓ మినరల్ వాటర్ వంటి వసతులను కల్పించారు. అంతే కాకుండా 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఈఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు ఇంగ్లిష్, డిజిటల్ బోధనలు అందుబాటులో ఉండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు పిల్లలు ఆసక్తి చూపుతున్నారు.

పుత్తూరు మండలంలోని పాఠశాలల వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	61
ప్రాథమికోన్నత పాఠశాలలు	5
ఉన్నత పాఠశాలలు	12
గురుకుల పాఠశాలలు	2
మొత్తం పాఠశాలలు	80
మొత్తం విద్యార్థులు	5,785


పంపిణీకి సిద్ధంగా టెస్ట్‌బుక్స్, నోట్‌బుక్స్


పంపిణీకి సిద్ధంగా యూనిఫామ్ కిట్స్

29న జాతీయ లోక్‌అదాలత్

నగరి: ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విష్ణువర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, ఐపీసీ, ఎంసీ, డీఈసీ, ఎస్‌టీసీ, సీసీ498ఏ కేసులు, ఎన్‌ఐ యాక్ట్, ఎస్‌ఈబీ, బ్యాంకు కేసులు, సెకండ్ క్లాస్ కేసులు, అడ్మిషన్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. సమయం, డబ్బు ఆదాకోసం ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు సుప్రీంతో సమానమని, అప్పీల్ ఉండదని పేర్కొన్నారు.

ఆశాజనకంగా వేరుశనగ దిగుబడి


దిగువ మోదలపల్లె వద్ద వేరుశనగ ఒబ్బిడి

తవణంపల్లె: రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. మండలంలోని రబీ సీజన్‌లో రైతులు 70 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. బోర్లు, బావుల నీటితో సాగు చేసిన వేరుశనగ పంట సాగు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ పంట ఒబ్బిడి చేస్తున్నారు. ఒబ్బిడి చేసిన వేరుశనగ అధిక దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో మళ్లీ వేరుశనగ పంట సాగు చేయాలని రైతులు ఆలోచిస్తున్నారు. రబీలో వేరుశనగ కాయలకు మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో కిలో పచ్చి శనగ కాయలు రూ.50 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది.

సమస్యలకు తక్షణ పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం
- పలు అభివృద్ధి పనులకు తీర్మానం

నగరి: సమస్యలను జాప్యం లేకుండా తక్షణం పరిష్కరించాలని అధికారులకు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం సూచించారు. బుధవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పీజీ నీల మేఘం అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ ఆదేశానుసారం అధికారులు సమావేశ అజెండాను చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలున్నా, వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉన్నా తెలపాలంటూ మున్సిపల్ చైర్మన్ సభ్యులను కోరారు. వైస్ చైర్మన్ వెంకటరత్నం మాట్లాడుతూ ఒకటో వార్డులో కల్వర్టు నిర్మించాల్సి ఉందని, వీధి దీపాలు ఏర్పాటుచేయాలని కోరారు. కౌన్సిలర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో పగటిపూట కూడా దీపాలు వెలుగుతున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అధికారులు వార్డులో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ప్రజావసరాలను పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలు

- మున్సిపల్ పరిధిలోని శ్మశాన వాటికలో క్రిమేషన్ యంత్రాన్ని వాడుకలోకి తీసుకు వచ్చేందుకు అవసరమైన 3 ఫేజ్ లైన్ ఏర్పాటు
- దెబ్బతిన్న తాగునీటి మోటార్లకు మరమ్మతులు
- కాలువల్లో పూడిక మట్టి, ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు కలువకుండా జంక్షన్‌లలో గ్రిల్స్ ఏర్పాటు
- వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ ఇంజక్షన్లు వేయడం
- పట్టణ పరిధిలో విచ్చలవిడిగా సంచరిస్తున్నందున కోతులను పట్టి అడవిలో వదలడం

వైభవంగా పొన్నెయమ్మ జాతర



సారె సమర్పిస్తున్న సురుటపల్లె ఆలయ ఈఓ, సిబ్బంది, సత్యవేడు : అమ్మవారి ఊరేగింపు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో శ్రీపొన్నెయమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. పల్లికొండేశ్వరస్వామి దేవస్థానం తరఫున కార్యనిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి, అర్చకులు, సిబ్బందితో కలిసి అమ్మవారికి మంగళ వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలతో కూడిన సారె సమర్పించారు. ఏటా జాతరకు శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయం నుంచి సారె సమర్పించడం ఆనవాయితీ. అర్చకులు, గ్రామపెద్దలు సంప్రదాయబద్ధంగా సారె స్వీకరించారు.

సత్యవేడు మండలంలో..

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో గంగమ్మ జాతర వేడుకగా జరిగింది. మంగళవారం రాత్రి 10గంటలకు ప్రారంభమైన ఊరేగింపు బుధవారం ఉదయం తొమ్మిది గంటల వరకు సాగింది. మహిషాసురమర్థిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తప్పెట్లు, మేళాలు, బాణాసంచా పేలుళ్ల సందడి నడుమ యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం నడివీధిలో అమ్మవారిని కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారికి ఇంటింటి నుంచి సారె తీసుకువచ్చి సమర్పించారు. గంగమ్మ వెంట గండు దీపం పట్టుకుని భక్తులు నడిచారు.


సత్యవేడు : సారె సమర్పిస్తున్న భక్తులు

నందిమంగళంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పూడిక తీస్తున్న మున్సిపల్ సిబ్బంది, మందులు పంపిణీలో వైద్య సిబ్బంది

పుత్తూరు: పట్టణ పరిధిలోని కట్టకింద రామకృష్ణాపురం గ్రామంలో అతిసారం ప్రబలకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. బుధవారం గ్రామంలోని కాలువల్లో పూడికలు తీయడంతో పాటు అక్రమ నీటి కొళాయిలను తొలగించారు. అవసరమైన చోట తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేశారు. నందిమంగళం గ్రామంలో అతిసారం ప్రబలిన నేపథ్యంలో అందరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మంచినీటిని కాచి వడబోసి తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సైతం గ్రామంలో పర్యటించి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాలను మున్సిపల్ ఏఈ హేమశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ పర్యవేక్షించారు.

కాణిపాకంలో రద్దీ

కాణిపాకం: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి దర్శనార్థం భారీగా క్యూకట్టారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు క్యూల్లో భక్తుల ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు. కాగా 26,722 మంది భక్తులు వినాయకస్వామివారిని దర్శించుకున్నారని ఆలయాధికారులు పేర్కొన్నారు. ఆలయ పరిసరాలు సైతం భక్తులతో సందడిగా మారాయి

ప్రకృతి పలకరింత మూలకోన

- ఏడాది పొడవునా జలధార
- కొండపై కొలువైన సంగమేశ్వరస్వామి
- మహాశివరాత్రిన ప్రత్యేక పూజలు
- సెలవు రోజుల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకుల రాక


కోన వద్ద ఆలయం

ప్రకృతి రమణీయత ఉట్టిపడే సహజ జలపాతం మూలకోన. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలపాతం కనువిందు చేస్తోంది. ఎత్తైన కొండలు, ఆకాశాన్ని అంటే వృక్షాలు.. ఆ వృక్షాలపై పక్షుల కిలకిలలు.. చల్లటి గాలి.. నేలను తాకని సూర్యరశ్మి.. ఎత్తైన బండరాళ్ల మధ్య నిరంతరం జాలువారే జలపాతం.. సహజ సిద్ధంగా ఏర్పడిన కోనేరు వంటి అందాలు మూలకోన సొంతం. ఇంతటి ప్రకృతి సౌందర్యాల మధ్య శ్రీపార్వతీ సమేత సంగమేశ్వరస్వామి కొలువై ఉన్నారు.


మూలకోనలో నిరంతరం జాలువారే జలధార


పుత్తూరు: పుత్తూరు పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో మూలకోన (పెద్దతీర్థంకోన) పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఎత్తైన కొండ రాళ్ల మధ్య నిరంతరం జాలువారే నీరు, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కోనేరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఏడాది పొడవునా జలధార ప్రవహిస్తూ ఉంటుంది. మడుగులోని నీటిలో అడుగున ఉన్న మట్టి, రాళ్లు, చిన్న చిన్న చేపపిల్లలు సైతం స్పష్టంగా కనిపించడం ఇక్కడి మరో విశేషం. దీంతో ఈ కోనను అద్దాల కోనగా కూడా పిలుస్తుంటారు. దశాబ్దాల నాటి ఈ పెద్దతీర్థంకోన అటవీప్రాంతంలో ఓ మూలగా ఉండడంతో కాలక్రమంలో మూలకోనగా మారింది. అనునిత్యం మనస్సును ఆహ్లాదపరిచే ఈ ప్రకృతి అందాలను తిలకించేందుకు సెలవు రోజుల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడి తరలివస్తుంటారు.


కోర్కెలు తీర్చే సంగమేశ్వరస్వామి

మూలకోన కొండపై శ్రీపార్వతీ సమేత సంగమేశ్వర స్వామి కొలువై ఉండగా, కోనేరుకు ఎదురుగా శ్రీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కొలువై ఉండడం ఇక్కడి మరో ప్రత్యేకత. జలపాతంలో స్నానమాచరించి, భక్తి ప్రపత్తులతో సంగమేశ్వరస్వామిని పూజిస్తే కోరిన కోరికలు తప్పక తీరుతాయని ప్రతీతి. ఏటా మహాశివరాత్రి ఉత్సవాలకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివస్తుంటారు. మహాశివరాత్రి వేడుకల్లో కోనేరులో నిర్వహించే తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తుతారు. పెద్ద ఎత్తున అన్నదానం, పండరి భజనలు, వీధినాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

పౌర్ణమి రోజున ఆకాశ దీపం

ప్రతి పౌర్ణమి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, ఎత్తైన కొండపై ఆకాశదీపాన్ని వెలిగించడం ఇక్కడి మరో ప్రత్యేకత. ప్రతి సోమవారం ప్రత్యేక పూజా కైంకర్యాలతో పాటు నిత్యదీపారాధన జరుగుతుంది. ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి తిరుమలరెడ్డి, సహాయ కార్యదర్శి మనోహర్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.


కోనలో కొలువైన సంగమేశ్వరస్వామి


కొండరాళ్ల మధ్య సెలయేరు

ఇలా చేరుకోవచ్చు

పుత్తూరు మండలం, నేసనూరు పంచాయతీ, కల్యాణ వేంకటేశ్వరపురం అటవీప్రాంతంలో మూలకోన ఉంది. పుత్తూరు నుంచి 6 కిలో మీటర్ల దూరంలోని గోపాలకృష్ణాపురం వరకు ప్రతిరోజూ బస్సు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి 2 కిలో మీటర్ల మేర మట్టి, గులక రాళ్ల రోడ్డు మీదుగా కల్యాణ వేంకటేశ్వరపురం గ్రామం చేరుకోవాలి. అక్కడి నుంచి మరో 2 కిలో మీటర్ల మేర గులకరాళ్ల దారి గుండానే కోనకు చేరుకోవచ్చు. కోన వరకు కార్లు, ట్రాక్టర్లు, బస్సులు వెళ్లేందుకు రోడ్డు అనువుగానే ఉంది.

విద్యుత్, రోడ్డు ఏర్పాటుకు కృషి

సహజసిద్ధ మూలకోన అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నాం. ప్రస్తుతం కల్యాణ వేంకటేశ్వర పురం వరకే విద్యుత్ సౌకర్యం ఉంది. అక్కడి నుంచి కోనకు విద్యుత్ లైన్ ఏర్పాటు, గోపాలకృష్ణాపురం నుంచి తారు రోడ్డు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కోనలోని సంగమేశ్వరస్వామి ఆలయ మెట్లను పునరుద్ధరించాలని నిర్ణయించాం. ఇలా అన్ని విధాల కోన అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు.



కె.భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు, మూలకోన అభివృద్ధి కమిటీ

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు


విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


పంటల సాగుపై అవగాహన

- ఖరీఫ్‌లో పంటల సాగుకు సన్నద్ధం

సదుం: ప్రస్తుతం మండలంలో రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. వర్షపాతం ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఖరీఫ్‌లో పంటల సాగుకు సన్నద్ధమై వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో మండలంలో 930 హెక్టార్లలో వర్షాధారంపై ఆధారపడి రైతులు వేరుశనగ సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఇప్పటికే ఇప్పటికే 1,350 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. అంతేకాకుండా 60 హెక్టార్లలో కంది, 12 హెక్టార్లలో అనుములు, అలసందలు, మరో 300 హెక్టార్లలో వరి సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

విత్తనశుద్ధి కీలకం

పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. తగిన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేస్తే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చు. దీనివల్ల మొలకలు బాగా పెరిగి తెగుళ్లను తట్టుకుంటాయి.

- విత్తనశుద్ధిని అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో చేయాలి.
- విత్తనాలు విత్తిన తర్వాత 25 నుంచి 35 రోజుల లోపు ఆకుపచ్చ తెగులు సోకకుండా కాంటాఫ్ మందు పిచికారీ చేయాలి.
- 90 రోజుల తరువాత బావిస్టన్ పిచికారీ చేస్తే ఆకు బలంగా, దృఢంగా ఏర్పడి మంచి దిగుబడులకు అవకాశం ఉంటుంది.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

సూచనలు పాటించండి



పంటల సాగులో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు–సూచనలు విధిగా పాటించాలి. మోతాదుకు మించి ఏ పంటకు కూడా ఎరువులు, మందులు వాడరాదు. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. విత్తనశుద్ధి విధిగా చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.

–హరిప్రసాద్, ఏఓ